క్లుప్తంగా

విమాన ప్రమాద మృతులకు నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

గాజువాక: అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో మృతులకు సీపీఐ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ రోడ్‌లోని కాకతీయ జంక్షన్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచాన్ని కుదిపేసిన ఈ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కె.వనజాక్షి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కించకుండా బాధ్యులను గుర్తించి వారిపై చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు, అప్పారి విష్ణుమూర్తి, శివ, ఈశ్వరరావు, పిల్లా పద్మ తదితరులు పాల్గొన్నారు.

135 మందికి కంటి వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అగనంపూడి: అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 85 వార్డు ఫార్మాసిటీ కాలనీ లేమర్తి జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, కర్రి దోంద్రరావు ప్రారంభించారు. శిబిరంలో 135 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. 42 మందిని శస్త్ర చికిత్స కోసం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు, వైస్ చైర్మన్ ఎస్.అర్జున, ట్రస్ట్ సభ్యులు సింగపల్లి రామారావు, లెక్కల సత్యనారాయణ, వార్డు కార్యదర్శి విందుల రాజు, మాజీ సర్పంచ్ చిమిటి అర్జున, డొక్క రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి



వరప్రసాద్ (ఫైల్)

కూర్మన్నపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ నెల 12న తుంగ్లాం రైల్వే గేటు సమీపంలో జరిగిన ప్రమాదంలో చెల్లి మృతి చెందగా అన్న గాయపడిన సంగతి తెలిసిందే. యాదవ జగ్గరాజుపేటలో నివాసం ఉంటున్న గొంప సతీష్ (అలియాస్ వరప్రసాద్) చెల్లి కీర్తన విధులకు వెళ్తుండగా కంటైనర్ ఢీకొట్టడంతో కీర్తన అక్కడికక్కడే మృతి చెందింది. వరప్రసాద్ తీవ్రంగా గాయపడడంతో కేజీహెచ్‌కు తరలించారు. వరప్రసాద్ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మరణించాడు. దువ్వాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫాదర్లకు వీడ్కోలు



సహాయక ఫాదర్లను సత్కరిస్తున్న జ్ఞానాపురం ప్రజలు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ పారిస్ విచారణ కర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో సహాయ విచారణకర్తలకు ఆదివారం ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ మేరకు వైజాగ్ ఆర్చ్ డయాసిస్ క్యాథెడ్రల్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు వేడుకల్లో ఏడాది కాలం పాటు పని చేసి జ్ఞానాపురం ప్రజల మన్ననలు చూరగొన్న సహాయ విచారణ కర్తలు రెవరెండ్ ఫాదర్లు వినయ్‌కుమార్, అంథోనీ రాజ్‌లను ఘనంగా సత్కరించారు. ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రభువు సువార్తను బోధించుటలో చిత్తశుద్ధి, అంకితభావంతో వీరు పనిచేసి, అధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిపూర్వకంగా జరగడానికి ఎంతో సహకరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రంగస్థల కళాకారులు, వ్యాఖ్యాత పాలమరశెట్టి ఫ్రాన్సిస్, పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) అధ్యక్షుడు ముసురు రాజేష్‌బాబు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్లీజ్.. డ్రైనేజీ సమస్య పరిష్కరించరూ!



రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు



నిలిచిపోయిన వ్యర్థాలు

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్–11లోని డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. టౌన్ అడ్మిన్ విభాగం వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని ఉద్యోగులు కోరుతున్నారు. సెక్టార్–11లోని 207 బి క్వార్టర్ ముందు ఉన్న డ్రైనేజీ పగిలి పోయింది. దీంతో వ్యర్థాలు, మురుగు నీరు రోడ్డు మీద ప్రవహిస్తోంది. దీంతో ఆ ప్రాంతమంతా దుర్గభరితంగా మారింది. సమస్యపై పలుమార్లు టౌన్ అడ్మినిస్ట్రేషన్‌కు ఫిర్యాదు చేశామని అక్కడి నివాసులు చెబుతున్నారు. అయినప్పటికీ స్పందించడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న పరిస్థితుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని వాపోతున్నారు. ఆడుకునే పిల్లలు, వృద్ధులకు మరింత ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉందని భయపడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించపోతే ఆ తర్వాత జరిగే పరిణామాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పరిస్థితిని అర్థం చేసుకోని వెంటనే సత్వర చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

– ఉక్కునగరం

ఉద్యోగుల తొలగింపే కూటమి గిఫ్ట్

- ప్రజలను ఇబ్బంది పెట్టేలా కూటమి పాలన
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



అమర్‌నాథ్‌తో వైఎస్సార్‌టీయూసీ నాయకులు

గాజువాక: ఎమ్మెల్యేగా పల్లా శ్రీనివాస్‌ను, విశాఖ ఎంపీగా భరత్‌ను గెలిపించినందుకు రిటర్న్ గిఫ్ట్‌గా ఉద్యోగులను తొలగిస్తున్నారని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. అమెరికా పర్యటన పూర్తి చేసుకొని తిరిగి వచ్చిన అమర్‌నాథ్‌ను ఆదివారం విశాఖ ఉక్కు వైఎస్సార్‌టీయూసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అనంతరం అమర్‌నాథ్ మాట్లాడుతూ భారీ మెజార్టీలతో గెలిపించినదానికి తగిన బహుమతిగా స్టీల్‌ప్లాంట్‌లో 40 ఏళ్లుగా పని చేస్తున్న 5వేల మంది కాంట్రాక్టు కార్మికులను అక్రమంగా తొలగించి ఆ కుటుంబాలను రోడ్డున పడేశారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 2.50 లక్షల మంది వలంటీర్లను, ప్రభుత్వ వైన్ షాప్‌లలో పని చేస్తున్న 30వేల మందిని, ఇంటింటికీ రేషన్ అందిస్తున్న 20వేల మందిని తొలగించారన్నారు. కూటమి కక్షపూరిత పాలనను ప్రజలు గమనిస్తున్నారని.. రాబోయే ఎన్నికల్లో కూటమికి తగిన బుద్ధి చెబుతారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను ప్రజలకు వివరించాలని అమర్‌నాథ్ కోరారు. అమర్‌నాథ్‌ను కలిసిన వారిలో వైఎస్సార్‌టీయూసీ నాయకులు మార్టుపూడి పరదేశి, సంపంగి ఈశ్వరరావు, గొందేశి అప్పలరెడ్డి, పిట్టా రెడ్డి, బోర శోభూషణరావు, కర్రి దాలినాయుడు, కాంట్రాక్ట్ యూనియన్ నాయకులు తిప్పల గురునాథ్, గొందేశి అప్పలరెడ్డి, అట్టా శ్రీను, ఇప్పవలస శ్రీనివాస్ తదితరులున్నారు.

పాలస్తీనా సంఘీభావ సభ విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న జగ్గునాయుడు

దాబాగార్డెన్స్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ అమానుష దాడి, మానవ హననాన్ని నిరసిస్తూ ఈ నెల 17న రాష్ట్ర వ్యాప్తంగా పాలస్తీనా సంఘీభావ దినం పాటించాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. దీనిలో భాగంగా విశాఖ జిల్లాలో ఆ రోజు ఉదయం 10 గంటలకు ఆర్టీసీ కాంప్లెక్స్ గురజాడ విగ్రహం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించి, అనంతరం నిర్వహించనున్న సభలో పాల్గొనాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. జగదాంబ జంక్షన్ సమీపాన సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహ్మాన్, సీపీఐఎంఎల్ ప్రజా పోరు కార్యదర్శి కె.దేవసహాయం, సీపీఎం కార్యదర్శి బి.పద్మ, పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.మన్మథరావుతో కలిసి మాట్లాడారు. ప్రపంచ పటం నుంచి పాలస్తీనా దేశాన్ని తొలగించాలనే కుట్రతో ఇజ్రాయిల్ దాడులు చేస్తుందని, పిల్లలు, మహిళలతో సహా వేలాది మందిని బలి తీసుకుంటుందని, ఆస్పత్రులు, విద్యా సంస్థలు, శరణార్థుల శిబిరాలు వేటినీ వదలడం లేదని తెలిపారు. ఈ మారణ హోమాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పాలస్తీనా, ఇజ్రాయిల్ రెండింటిని స్వతంత్ర దేశాలుగా గుర్తించడమే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారమని అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి మన దేశం అలీన విధానానికి కట్టుబడి, పాలస్తీనాకు అండగా నిలుస్తోందని తెలిపారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దానికి తూట్లు పొడుస్తూ అమెరికన్ సామ్రాజ్యవాదానికి వంత పాడుతుందన్నారు. ఇది దేశ ప్రయోజనాలకు విఘాతమని, వెంటనే అటువంటి వైఖరిని విడనాడాలని డిమాండ్ చేశారు.

ఘనంగా సాగరిగిరి కనకదుర్గ ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో శ్రీ సాగరిగిరి కనకదుర్గమ్మ



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: యారాడ కొండపై వెలసిన శ్రీ సాగరిగిరి కనకదుర్గ ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి పంచామృతాభిషేకాలు చేపట్టారు. ఆలయ ఆవరణలో వెలసిన శివాలయంలో ఈశ్వరుడికి రుద్రాభిషేకం జరిపారు. అనంతరం ఆలయ ఆవరణలో సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

డీఈవోకు సత్కారం



డీఈవో ప్రేమ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఆరిలోవ: జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్‌ను డీఈవో కార్యాలయంలో ఆదివారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్‌ను విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా డీఈవోను ఘనంగా సత్కరించి అభినందించారు. ఇటీవల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ అన్ని ఉపాధ్యాయ సంఘాలు, విద్యా శాఖాధికారులు, సిబ్బంది సహకారంతో కౌన్సెలింగ్ ప్రశాంతంగా నిర్వహించగలిగామన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం, అనకాపల్లి డీసీఈబీ సెక్రటరీలు ఎం.వి. కృష్ణకుమార్, సత్యనారాయణ, ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు, ఉపాధ్యక్షుడు జి.వరహాల దొర, పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు లలిత్‌కుమార్, స్కూల్ గేమ్స్ సెక్రటరీ దేముడు పాల్గొన్నారు.

పరామర్శ



రమణను పరామర్శిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి

కూర్మన్నపాలెం: ఇటీవల కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న వైఎస్సార్‌సీపీ బీసీ నాయకుడు ఎన్నేటి రమణను ఆదివారం ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు 87వ వార్డు నాయకులు బొడ్డ గోవింద్, ప్రగడ శ్రీను,చిత్రాడ రమణ,ముద్దపు దామోదర్‌రావు,బొడ్డ వెంకటసూరి,శ్రీనివాసరెడ్డి, కొన్నా నారాయణ,గాలి నూకరాజు,సత్యవతి,కనకలక్ష్మి పద్మావతి,బ్రహ్మం తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్ల పిల్లలకు తల్లికి వందనం ఇవ్వాలి



రైల్వేస్టేషన్ వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న వామనమూర్తి, ఆటో డ్రైవర్లు

తాటిచెట్లపాలెం: ఆటోడ్రైవర్ల పిల్లలకు తల్లికి వందనం వర్తింపజేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం రైల్వేస్టేషన్ పోస్టాఫీసు జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వామనమూర్తి మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తే ఇంట్లో ఎందరు పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం రూ. 15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి నేడు కరెంటు బిల్లు 300 యూనిట్లు దాటిన వారికి, ముఖ్యంగా పేద కుటుంబాలకు చెందిన ఆటో డ్రైవర్లకు ఈ కరెంటు బిల్లు లింకు సాకు చూపి తల్లికి వందనం ఎగ్గొట్టడం, మొండిచేయి చూపడం అన్యాయమన్నారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. విశాఖలో ఈ నెల 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముందే ఆటో డ్రైవర్ల పిల్లలకు తల్లికి వందనం డబ్బు బ్యాంకుల్లో వేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో స్టాండ్ అధ్యక్షుడు వై. వెంకట్, రవి, కృష్ణ, రమేష్, రాజేష్, గణేష్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయంలో వడాయితీ సంప్రోక్షణ

సింహాచలం: మిథున సంక్రమణాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వడాయితీ సంప్రోక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రోక్షణం చేశారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలకు స్నపన తిరుమంజనం అనంతరం శీతలోపచారాలు జరిపారు. సాయంత్రం మాడవీధుల్లో ఉత్సవమూర్తులకు తిరువీధిని వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తరించారు.

రైల్వే పనుల్లో భద్రతకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న డీఆర్ఎం లలిత్ బోరా

తాటిచెట్లపాలెం: డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా ఆదివారం ఆయా విభాగాల అధికారులు, సిబ్బందితో సింహాచలం నార్త్ క్రూ లాబీలో సేఫ్టీ సెమినార్ నిర్వహించారు. వాల్తేర్ డివిజన్లో ప్రస్తుతం జరుగుతున్న పలు భద్రతా, ఆధునికీకరణ పనులను పర్యవేక్షించారు. రైల్వే పనుల్లో భద్రతకు ప్రాధాన్యమివ్వాలని అధికారులకు సూచించారు. లెవెల్ క్రాసింగ్స్ నిర్వహణ, వంతెనలు, మలుపులు, టన్నెల్స్, సిగ్నలింగ్ సిస్టం, ఇతర భద్రతాపరమైన విషయాల గురించి డీఆర్ఎం చర్చించారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ ఎం.కె.సాహూ, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్(ఆపరేషన్స్) శివనరేష్, డీఈఈ(ఆపరేషన్స్) సంచయ్ ఆడారిలను ఘనంగా సత్కరించారు. సమావేశంలో లోకో ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు



70 ఏళ్లు దాటిన వారిని సత్కరిస్తున్న లక్ష్మి, అప్పారావు తదితరులు

పెదగంట్యాడ: నవమాసాలు మోసి అమ్మ జన్మనిస్తే.. బతుకంతా ధారపోసి జీవితాన్ని ఇస్తాడు నాన్న అని యాత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, యాత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అండిబోయిన లక్ష్మి అన్నారు. జీవీఎంసీ 72వ వార్డు పరిధిలోని వుడా కాలనీలో ఫాదర్స్ డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాత, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశయన, కల్లుగీత సామాజిక వర్గానికి చెందిన 70 ఏళ్ల దాటిన పెద్దలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పించి వారిని సంఘంలో గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో నాన్న పాత్ర ఎంతో కీలకమన్నారు. తండ్రి త్యాగాన్ని వెల కట్టలేమన్నారు. తండ్రులను గౌరవించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో యాత, శెట్టిబలిజ, ఈడిగ శ్రీశయన సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు అండిబోయిన అప్పారావు, ఆశప్రియ, వనుము నాగేశ్వరరావు, మల్లుల సూర్యనారాయణ, ఏవీ రమణ, బొంతు కనకారావు, పితాని భాస్కర్, అప్పలరాజు, సన్నీ, రమణ, మంగరాజు, బత్తిన రాము, పితాని శంకర్, పట్నాల అప్పలరాజు, లక్ష్మణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కోరాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతినిధులు

పెదగంట్యాడ: శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పత్రిజీ పిరమిడ్ స్పిరుచ్వల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రేవతీదేవి, బీజేపీ ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి కట్టా పద్మ అన్నారు. అహింసా పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకుడు మీసాల శివ గణేశ్వరరావు ఆధ్వర్యంలో జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని పల్లి వీధి, కోరాడలో ఆదివారం శాకాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శాకాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొంగు లక్ష్మి, సుబ్బలక్ష్మి, శారదమ్మ, అప్పారావు, బాలాజీ, మూర్తి, అప్పలరాజు, రమణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ సేవా సంఘ కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న నెల్లి అప్పలరాజు

పెదగంట్యాడ: కుంచుమాంబ శెట్టిబలిజ సేవా సంఘం గౌరవాధ్యక్షుడి నెల్లి అప్పలరాజు ఎన్నికయ్యారు. జీవీఎంసీ 64వ వార్డు పరిధి గొడ్డువానిపాలెంలోని కమిటీ హాల్‌లో ఆదివారం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం చైర్మన్‌గా నెల్లి గురుమూర్తి, అధ్యక్షుడిగా గొడ్డు రమణ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా నడిగట్ల ప్రసాద్, కోశాధికారిగా పితాని మాధవ్, ఉపాధ్యక్షునిగా శెట్టి చిన్న, జాయింట్ సెక్రటరీలుగా గొడ్డు శ్రీను, గొడ్డు గురుమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పితాని అప్పన్న, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా గొడ్డు విజయ్, సిమ్మ బాలరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడు నెల్లి అప్పలరాజు మాట్లాడుతూ కొత్త కమిటీ గ్రామాభివృద్ధికి పాటు పడాలని కోరారు. గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం కొత్త కమిటీతో ప్రమాణం చేయించారు.

మోదీ సంస్కరణలు దేశాభివృద్ధికి దోహదం



సమావేశంలో ప్రసంగిస్తున్న కరణంరెడ్డి

గాజువాక: గడిచిన పదకొండేళ్లలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమలు చేసిన అనేక సంస్కరణలు దేశ అభివృద్ధికి దోహదం చేశాయని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. చినగంట్యాడలో ఆదివారం ఏర్పాటు చేసిన బీజేపీ వికసిత్ భారత్ సంకల్ప సభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి మోదీ సంకల్పించిన వికసిత్ భారత్ లక్ష్యంగా అందరూ ముందడుగు వేయాలన్నారు. ప్రపంచ దేశాలు సైతం మోదీ పాలనపై ప్రశంసలు కురిపిస్తున్నాయన్నారు. గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతం కావడానికి మోదీ సంకల్పబలమే కారణమన్నారు. కార్యక్రమంలో నాయకులు సిరసపల్లి నూకరాజు, పాలిమేర శ్రీనివాస్, దీనంకొండ కృష్ణంరాజు, బొండా ఎల్లాజీరావు, జీలకర్ర భువనేశ్వరి, తులసీదాస్, రోహిణి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి గ్లోబల్ యాప్‌తో అభ్యున్నతి



గ్లోబల్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న పద్మశాలి ప్రతినిధులు

సీతంపేట: పద్మశాలీల అభ్యున్నతికి పద్మశాలి గ్లోబల్ యాప్ ఎంతో ఉపయోగపడే డిజిటల్ వేదిక అని పద్మశాలి గ్లోబల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మేరువ వెంకటేశ్వర్లు, స్వాతి సైన్స్ ఒంగోలు చైర్మన్ కవరతపు ప్రసాదరావు, రోఎస్‌బిటీ సొల్యూషన్స్ డైరెక్టర్ గోలి తిరుపతిరావు, కర్నూలు మాజీ ఎంపీ సింగరి సంజీవ్ కుమార్ అన్నారు. శంకరమఠం రోడ్‌లో ఉన్న పద్మశాలి భవన్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో పద్మశాలి గ్లోబల్ యాప్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తమ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని పిలుపు నిచ్చారు. పద్మశాలి గ్లోబల్ యాప్ ఆవిష్కరణ గర్వకారణమైన విషయమన్నారు. ఈరోజు నుంచి పద్మశాలి చరిత్రలో కొత్త అధ్యాయం మొదలవుతుందని తెలిపారు. భౌగోళిక సరిహద్దులు చెరిపేసి గ్లోబల్ పద్మశాలి కుటుంబ నిర్మాణానికి దోహదపడిన రోజని పేర్కొన్నారు. నాటి మగ్గం నుంచి నేటి సాంకేతిక విజ్ఞానం దాకా పద్మశాలీయుల ప్రతిభ సమాజానికి సేవ చేస్తోందన్నారు. ఈ యాప్ ద్వారా పద్మశాలి కులస్తుల సాధికారత, వివాహ సంబంధాలు, వేడుకలు, అభిప్రాయ సేకరణ, ఎన్నికల నిర్వహణ, సమస్యల పరిష్కారం, పేద పద్మశాలి కుటుంబాలకు సహాయం, పద్మశాలి సంస్కృతి రాబోయే తరానికి అందించడం లక్ష్యంగా యాప్ సేవలందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి నాయకులు పప్పు రాజారావు, సూరిశెట్టి సూరిబాబు, బురిడి కల్యాణి, కొప్పుల రమేష్ వానపల్లి ఈశ్వరరావు, రాపర్తి సుబ్బారావు, కొప్పుల రామ్‌కుమార్, కోడిదాసు శ్రీనివాసరావు, పలువురు పద్మశాలి సంఘ నాయకులు పాల్గొన్నారు.